తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

### చుక్కలనంటుతున్న

## వినాయక విగ్రహాల ధరలు



కోట, ఆగస్టు 23 ప్రభాతవార్త
బొజ్జ గణపయ్య విగ్రహాల ధరలు ఈ ఏడాది చుక్కలనంటుతున్నాయి. విగ్రహాల తయారీకి ఉపయోగించే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్, ఆయిల్, రంగులు, అలంకరణకు ఉపయోగించే సామగ్రి ధరలు 50 నుంచి 60 శాతం పెరిగాయి. వివిధ రకాల వస్తువులన్నీ వేరే ప్రాంతాల నుంచి రవాణా చేసుకోవాలన్నా ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు పెరిగాయి. కూలీల ధరలు కూడా అదేవిధంగా ఉన్నాయి. గతంలో రాజస్తాన్ నుంచి వచ్చే కూలీలకు వసతి, ఆహారం పెట్టి రోజుకు రూ.500 నుంచి రూ.700 ఇచ్చేవారు. ఇప్పుడు అన్నిటితో పాటు రోజు కూలీ వెయ్యి నుంచి 1200 రూపాయలు ఇస్తామన్నా పనులకు వచ్చే వారు లేరని వ్యాపారులు చెప్తున్నారు. వీటన్నింటి ప్రభావం విగ్రహాల ధరలపై పడింది. 12 నుంచి 14 అడుగుల విగ్రహాలను ఎక్కువమంది కొనుగోలు చేస్తారు. 12 అడుగుల విగ్రహాలు గతంలో రూ.14 వేల నుంచి 20 వేల రూపాయల లోపు లభించేవి. ప్రస్తుతం రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు పలుకుతున్నాయి. అదేవిధంగా 14 అడుగుల విగ్రహాల ధరలు రెండేళ్ల క్రితం రూ.30 వేల నుంచి రూ.50 వేలలోపు డిజైన్‌ను బట్టి ఉండేవి. ప్రస్తుతం అవి రూ.70 వేల నుంచి లక్ష రూపాయల వరకు చెప్తున్నారు. జిల్లాలో చవితి ఉత్సవాలకు సుమారు 10 వేల నుంచి 20 వేల విగ్రహాల వరకు ఏర్పాటు చేస్తారు. కొంతమంది యువత విగ్రహాల ధరలు పెరిగిన నేపథ్యంలో తక్కువ ధరకు లభించే మట్టి విగ్రహాల వైపు చూస్తున్నారు. ఇటు ఖర్చు తగ్గడంతో పాటు అటు పర్యావరణానికి మేలు కలుగుతుందన్న ఆలోచన కలిగిస్తున్నాయి. ఆశించిన మేరకు మట్టి విగ్రహాలు అందుబాటులో లేకపోవడంతో సమస్యగా మారింది. రెండేళ్ల నుంచి కొవిడ్ కారణంగా పండగ జరుపుకోకపోవడంతో ఈ ఏడాది ఖర్చుకు వెనకాడకుండా విగ్రహాలు ఏర్పాటు చేయాలని మరికొన్ని ఉత్సవ కమిటీలు భావిస్తున్నాయి.

## కష్టాలు తొలగించాలని వేడుకున్నా

### రాష్ట్ర మంత్రి వేణుగోపాలకృష్ణ



తిరుమల, ఆగస్టు 23 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వామివారి ఆశీస్సులు కలగాలని, రాష్ట్రంలో ఉన్న కష్టాలు తొలగించాలని వేంకటేశ్వరస్వామిని ప్రార్ధించినట్లు రాష్ట్రమంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. మంగళవారం ఉదయం తొలుత స్వామివారిని దర్శించుకున్న మంత్రి చెల్లుబోయిన అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న అఖిలాండం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

# స్పందన అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టండి

### - ప్రజలకు పారదర్శకమైన ప్రభుత్వ సేవలు...- కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్మోహన్‌రెడ్డి

తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 23 ప్రభాతవార్త ః
సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాడే పల్లి సీఎం క్యాంపు కార్యాలయం నుంచి స్పందన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఏస్పీలు, జాయింట్ కలెక్టర్లతో సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు తిరుపతి కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి, జిల్లా జాయింట్ కలెక్టర్ కె. బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి పాల్గొన్నారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, గ్రామ సచివాలయ భవనాలు, ఆర్‌బీకే భవనాలు, డాక్టర్ వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్స్, ఏఎంసీయూ, బీఎంసీయూ యూనిట్ల కేంద్రాలు, వైఎస్ఆర్ డిజిటల్ లైబ్రరీలు, నాడు-నేడు పనులు, వైఎస్ఆర్ అర్బన్ క్లినిక్‌లు, ఏపీ టిడ్కో ఇళ్ళు, పేదలందరికీ ఇళ్ళు, 90 రోజుల ఇంటి పట్టాల పంపిణీ, జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్షా పథకం, స్పందన, నేషనల్ హైవేస్, ఇరిగేషన్, ల్యాండ్ అక్విజేషన్, దిశా చట్టం, తదితర అంశాలపై సీఎం సమీక్షించి జిల్లా కలెక్టర్లకు పలు సూచనలు ఇచ్చారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 25న నేతన్న నేస్తం, సెప్టెంబరు 22న వైఎస్ఆర్ చేయూత పంపిణీ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం జగన్మోహన్‌రెడ్డి, పాల్గొన్న తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, జిల్లా యంత్రాంగం

ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు హౌసింగ్ పీడీ చంద్రశేఖర్ బాబు, హౌసింగ్ ఓఎస్‌డీ రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ శ్రీనివాస ప్రసాద్, జిల్లా పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ అధికారి శంకర్ నారాయణ, ఆర్ డబ్ల్యూ ఎస్ అధికారి విజయకుమార్, సీపీవో అశోక్‌కుమార్, గ్రామ, వార్డు సచివాలయ కో-ఆర్డినేటర్ జగదీష్, ఏడీ సర్వే జయరాజ్, డీపీవో రాజశేఖర్‌రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### వివాహ వేడుకలకు వెళుతూ

## రోడ్డు ప్రమాదంలో టిడిపి నేతలు దుర్మరణం

### అచ్చెన్న.. గల్లా .. పులివర్తి "దిగ్భ్రాంతి"







చంద్రగిరి, ఆగస్టు 23 ప్రభాతవార్త:
చిత్తూరు (పార్లమెంటరీ నియోజకవర్గ) జిల్లా టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ గంగపల్లి భాస్కర్, తెలుగుయువత చంద్రగిరి మండల అధ్యక్షుడు భానుప్రకాష్ రెడ్డి (బన్నీ) వివాహ వేడుకలకు వెళుతూ రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. గుంటూరులో టిడిపికి చెందిన ముఖ్య నేత కుటుంబంలోని వివాహ వేడుకలకు హాజరయ్యేందుకు గంగపల్లి భాస్కర్, బన్నీ, పెరుమాళ్‌పల్లికి చెందిన సోము కారులో బయలుదేరారు. ఒంగోలు సమీపంలోని కొండమంజులూరు వద్ద కారు అదుపు తప్పి ముందు వెళుతున్న లారీని ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో బన్నీ కారులోనే మృతి చెందగా, గంగపల్లి భాస్కర్ వైద్య చికిత్సలు పొందుతూ తుది శ్వాస విడిచారు. ఈ ప్రమాదంలో సోము స్వల్పగాయాలతో బయటపడ్డారు. సమాచారం అందుకున్న పులివర్తి నాని హుటాహుటిన ఒంగోలుకు బయలుదేరి వెళ్ళారు. అచ్చెన్నాయుడు, గల్లా అరుణకుమారి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్, మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ దొరస్వామి నాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు పల్లినేని సుబ్రమణ్యం నాయుడు, ప్రధాన కార్యదర్శి కొండూరు ప్రవీణ్ రాయల్ మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప ం వ్యక్తం చేశారు. తెలుగు దేశం పార్టీలో చురుగ్గా వ్యవహరిస్తున్న సీనియర్ నాయకుడు గంగపల్లి భాస్కర్, తెలుగుయువత మండల అధ్యక్షుడు బన్నీ మృతి పార్టీకి తీరనిలోటని నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆవేదన వ్యక్తం

## కాణిపాకం బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు



కాణిపాకం, ఆగస్టు 23 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో ఈనెల 31 నుండి జరుగనున్న స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు దేవస్థానం ఏర్పాట్లను ప్రారంభించింది. దేవస్థానంలో ఈనెల 31 నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ప్రతిఏటా 21 రోజులు పాటు జరిగే ఈఉత్సవాలను అత్యంత ఘనంగా నిర్వహిస్తుంటారు. ప్రధాన ఆలయ కుంభాభిషేకం సందర్భంగా ప్రధాన ఆలయంతో పాటు పరివార ఆలయాలకు రంగులు వేయడం, ప్రధాన ఆలయంలో రంగ వల్లులు తీర్చిదిద్దడం, విద్యుత్ దీపాలంకరణ వంటి పనులు చేయడంతో బ్రహ్మోత్సవాలకు కొంత వరకు ఏర్పాట్లు చేయడం సులభతరమైంది. మిగిలిన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయడానికి ఆలయ ఇంజనీరింగ్ అధికారులు చర్యలు చేపడుతున్నారు. విద్యుద్దీపాల కటౌట్‌లు, ఆర్చిల ఏర్పాటుకు కార్మికులు సిద్ధంచేస్తున్నారు.

## అప్పులు తెచ్చిన తిప్పలు: నిండు ప్రాణం బలి

### తక్కువ వడ్డీలకు సేకరణ: ఎక్కువ వడ్డీలకు అప్పగింత : శ్రీకాళహస్తిలో విషాదం

**పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో చీటీల పేరుతో కొందరు, చీరల వ్యాపారం పేరుతో మరి కొందరు. నిట్టనిలువునా మునుగుతుండగా మగవారు ఉదయం నుంచి కాయ కష్టం చేసి సంపాదించిన సంపాదన ఉన్న పళంగా లక్షలాది కారులు, కోటేశ్వరులు కావాలనే లక్ష్యంతో 'లాటరీలకు తమ సంపాదనను తగులబెట్టి నష్టపోతున్నారు. చివరికి అప్పుల బాధలు పెరిగి ప్రాణాలను తీసుకునే పరిస్థితి ఏర్పడుతోంది.**



శ్రీకాళహస్తి, ఆగస్టు 23 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి పట్టణంలోని శ్రీరామనగర్‌కాలనీలో సోమవారం రాత్రి జరిగిన ఓ సంఘటన పట్టణ ప్రజలను, ప్రజా ప్రతినిధులను కలచి వేసింది. శ్రీరామనగర్ కాలనీ ఆఫీసర్లు నివాసముంటున్న ప్రాంతం. ఇక్కడ పరిమి సూర్యనారయణ అనే వ్యక్తి కార్‌పార్కింగ్ ఏర్పాటు చేసుకొని సంసారాన్ని సాగిస్తున్నారు. అతనికి పరిమి సుధష్ణ(సుధ) అనేయువతితో వివాహమైంది. వారికి ఒక కుమారుడు శివదేవదాసు. చెన్నైలో బిటెక్ చదువుతున్నాడు. వీరి కుటుంబం సజావుగా సాగు తుంది. సుధా చీరల వ్యాపారం ప్రారంభించింది. ఈ వ్యాపారంతో పట్టణంలో పరిచయాలు పెరిగాయి. పుట్టి పెరిగింది, ఇదే ఊరు కావటం చదువుకున్నది ఈ ప్రాంతమే కావటంతో సర్కిల్ బాగా పెరిగింది. చీరల వ్యాపారంతో పాటు తమ సంపాదనను పెంచుకొనుటకు తక్కువ వడ్డీలకు సన్నిహితం ఉన్న వారి నుంచి సేకరించి ఎక్కువ వడ్డీలకు ఇచ్చే వ్యాపారం ప్రారంభించింది. ఈ వ్యాపారం ప్రారంభంలో బాగానే సాగినా తరువాత తీసుకున్న వారు సకాలంలో వడ్డీలు చెల్లించకపోవటం తాను తెచ్చుకున్న వారికి సకాలంలో ఇవ్వలేక పోవటం ఇచ్చిన వారు వత్తిడి తీసుకురావటం తీసుకున్న వారు ఇవ్వక కాలయాపన చేయటంతో సమస్య మొదలైంది. డబ్బున్న వారి నుంచి రూపాయిన్నర రెండు రూపాయల వడ్డీలకు తెచ్చుకొని ఇక్కడ రూ.3ల వడ్డీలకు ఇవ్వటం మొదలెట్టింది. ఇలా సుధా సుమారు 20 మంది నుంచి అప్పులు తెచ్చింది. ఆ సొమ్ములను శ్రీకాళహస్తి, తిరుపతిలోని కొందరు ప్రముఖులకు అందజేసారు. తీసుకున్న వారు మొదట బాగానే చెల్లింపులు చేసినా తరువాత మొండి పద్దారని సుధా రాసుకున్న ఆత్మహత్య స్వీయ ఉత్తరంలో పేర్కొన్నారు. తానకు అప్పు ఇచ్చిన వారు వత్తిడి తీసుకురాగా తాను ఇచ్చిన వారు ఇవ్వక పోగా బతుకు సందిగ్ధంలో పడిందని పేర్కొన్నారు.

నాయకుల వద్దకు తిరిగి తిరిగి . . .

సుధా తన బాధలను జిల్లాకు చెందిన ఓ మంత్రి వద్దకు పలుమార్లు విన్నవించినట్లు సమాచారం. అలాగే ఓ ప్రజాప్రతినిధికి కూడా మొరబెట్టుకున్నట్లు సమాచారం. కానీ వారెవరూ తన బాధలు తీర్చలేదని సుధా బాధపడినట్లు చర్చించుకుంటున్నారు. అయితే ఆమె రాసిన స్వీయ ఆత్మహత్య ఉత్తరంలో తాను ఎలాగూ తనువు చాలిస్తున్నాను. స్థానిక శాసనసభ్యుడు అయినా తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరింది. తాను అప్పులు ఇచ్చిన వారి నుంచిన్యాయం చేయాలని తన బిడ్డ చదువును కొనసాగించుటకు సహకరించాలని కోరింది. ఈ ఉత్తరాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అయితే తన వద్ద తీసుకున్న పెద్ద మొత్తంకు సంబంధించి తీసుకున్న వారి కుటుంబం అంతటికి తెలుసునని ఆ సొమ్ములతో ఆమె కుమార్తె వివాహం నిర్వహించిందని ఆమె పేర్కొనింది. సోమవారం అర్థరాత్రి సూర్యనారాయణ ఇంటికి వెళ్ళగా భార్య ఇంటిలో ఉరితాడుకు వేలాడుతుండగా చూసి నివ్వెరపోయాడు. వెంటనే డివైయస్‌పి విశ్వనాధంకు సమాచారం అందించారు. విచారణ చేపట్టారు. కేసు వన్‌టౌన్ సిఐ అంజూ యాదవ్ నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో పోస్టు మార్టం జరిపారు. సుధా మృతదేహాన్ని శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అక్కడకు చేరుకొని నివాళులర్పించారు. ఎంఎల్‌ఏ మాట్లాడుతూ చిన్ననాటి స్నేహితురాలు సుధీష్ట దూరం కావటం బాధకరం అన్నారు. కాగా మృతురాలు తెలుగుదేశం నాయకుని బంధువు కావటంతో ఉదయం నుంచి పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్, మాజీ కౌన్సిలర్‌ప్రసాద్ నాయుడులు ఆసుపత్రిలోనే ఉండి పోస్టు మార్టం తరువాత శవాన్ని తీసుకెళ్ళారు.

## సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు మన టంగుటూరి

### – జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 23 ప్రభాతవార్త ః
నిరుపేద కుటుంబంలో పుట్టిన సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు ఆంధ్ర రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రి అయ్యారని ఆయనను స్మరించుకోవడం మన విధి అని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి అన్నారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్, జేసీ, జిల్లా యంత్రాంగం టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 1872 ఆగష్టు 23న జన్మించారని, తన పదకొండేయేట తండ్రి మరణించడంతో పిల్లలను తీసుకుని తల్లి ఒంగోలు చేరి భోజనశాల నడిపినా తల్లి సంపాదన చాలక ధనికుల ఇళ్ళల్లో వారాలకు పనిచేసి , చిన్న వయస్సు లోనే ప్రకాశం నాటకాలు వేసి చదువు సాగించి న్యాయవాదిగా ఎదిగి, స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్నారన్నారు. పొట్టి శ్రీరాములు ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధనకై ఆమరణ నిరాహార దీక్ష చేస్తూ మరణించడంతో ఉద్యమ ఫలితంగా 1953 అక్టోబరు 1న ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినపుడు తొలి ముఖ్యమంత్రిగా ప్రకాశం పంతులు నియమితుడయ్యాడని, తిరుపతిలో శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపన, సేద్యపు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, విజయవాడ వద్ద కృష్ణానది నదిపై బ్యారేజీ నిర్మాణంలో తన వంతు కృషి చేశారని తెలియజేశారు.

## పంటలకు పురుగుల మందుల స్ప్రేకు డ్రోన్ కెమెరాలు

### - రూ.10 లక్షలకు రైతు గ్రూపులకు 40 శాతం సబ్సిడీ
### - జిల్లాకు 93 అత్యాధునిక కెమెరాలు



వరి పంటకు డ్రోన్ కెమెరాతో పురుగుల మందు పిచికారి.

చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:
వ్యవసాయ రంగం ఆధునిక పరిజ్ఞానంతో కొత్తపుంతలు తొక్కుతుంది. పంటలకు పురుగుల మందులు స్ప్రే చేయడానికి ప్రస్తుతం అత్యాధునిక డ్రోన్ కెమెరాలు వచ్చేశాయి. వ్యవసాయ రంగంను అత్యంత ఆధునిక రంగంగా తీర్చిదిద్దాలని సంకల్పించిన రాష్ట్ర ప్రభుత్వం రైతులు లాభ సాటి వ్యవసాయం చేపట్టడానికి జిల్లాలోని 31 మండలాలకు 93 అత్యాధునికి డ్రోన్ కెమెరాలను ప్రభుత్వం మంజూరు చేసింది. జిల్లాలో ఉద్యాన పంటలతో పాటు వరి పంటకు పురుగుల మందు పిచికారి చేయడానికి ఈ అత్యాధునిక డ్రోన్ కెమెరాలను వినియోగించవచ్చు. ఈ అత్యాధునిక ఒక డ్రోన్ కెమెరా 10 లక్షల రూపాయలు. అయితే రైతు గ్రూపులకు 40 శాతం సబ్సిడీతో జిల్లా వ్యవసాయ శాఖ ఈ డ్రోన్ కెమెరాను అందజేయనుంది. ఇందుకు సంబంధించి జిల్లాలో ఈ నెలాఖరులోపు రైతు గ్రూపులను ఏర్పాటు చేసి రైతు గ్రూపులో ఒక రైతును పైలెట్ రైతుగా ఎంపిక చేసి వారికి ఈ డ్రోన్ కెమెరాలను అందించడం జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళీకృష్ణ పేర్కొన్నారు. ఒక డ్రోన్ కెమెరా విలువ 10 లక్షల రూపాయలు కాగా రైతు గ్రూపుకు 40 శాతం సబ్సిడీ మంజూరు అవుతుందని మిగిలిన మొత్తం బ్యాంకు రుణం మంజూరు చేయడం జరుగుతుందన్నారు. రైతు గ్రూపులు అన్ని ఏర్పాటు చేసి అందులో పైలెట్ రైతుల వివరాలను ప్రభుత్వానికి పంపడం జరుగుతుందన్నారు. 40 శాతం సబ్సిడీని ప్రభుత్వం పైలెట్ రైతు బ్యాంకు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. డ్రోన్ కెమెరా ఉపయోగించే విధానం రైతు గ్రూపు సభ్యులకు ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణ పూర్తయిన అనంతరం రైతులకు డ్రోన్ కెమెరాలు అందించడం జరుగుతుందన్నారు.

## నేటినుంచి చంద్రబాబు కుప్పం పర్యటన

### కేడర్‌లో ఉత్సాహం.. ప్రజల్లో చైతన్యమే లక్ష్యం!!
### ప్రతి మూడు నెలలకోసారి జనం మధ్యన 'చంద్రన్న' !!



కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త
ప్రతిపక్షనేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో బుధ, గురు, శుక్రవారాల్లో పర్యటించనున్నారు. కుప్పం ప్రజలకు ఇచ్చిన మాట మేరకు కుప్పం నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఓ సారి చంద్రబాబు పర్యటిస్తూ ప్రజల మధ్యన ఉంటూ వారి సాధక బాధలు తెలుసుకుంటూ 2024 అసెంబ్లీ ఎన్నికలకు పోరు సమాయత్తం చేస్తున్నారు. కుప్పం నియోజకవర్గంలో ఉన్న పార్టీ కేడర్‌లో ఉత్సాహం నింపడంతో పాటు వారిని ఎన్నికలకు సిద్ధం చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో తీసుకెళ్లి వారిలో చైతన్యం కలిగించడమే లక్ష్యంగా 'చంద్రన్న' పక్కాగా పావులు కదు పుతున్నారు. తాజా పర్యటనకు కొంతమంది నేతలు వాయిదా వేద్దామని భావించినా అందుకు చంద్రబాబు ససేమిరా అంటూ కుప్పంలో పర్యటనకు సిద్ధమయ్యారు.

**మారుమూల గ్రామాలకు చంద్రబాబు :** కుప్పం నియోజకవర్గంలోని మారుమూల గ్రామాల్లో సైతం పర్యటించడం కొనసాగుతోంది. ఒక్కో పర్యటనలో ఆయా మండలాల్లో ఉన్న సరిహద్దు గ్రామాలు సైతం టచ్ చేస్తున్నారు. ప్రతి గ్రామంలోను ఎన్నికల నాటికి పర్యటించాలనే దిశగా చంద్రబాబు ముందుకు సాగుతున్నారు. దీంతో గ్రామాల్లో ఉన్న పార్టీ కార్యకర్తలు కూడా ఉత్సాహం చూపుతున్నారు.

**పార్టీ శ్రేణులకు దిశానిర్దేశాలు :** కుప్పం నియోజకవర్గంలో ఉన్న పార్టీ శ్రేణులకు ఈసారి పర్యటనలో ఒకరోజంతా పార్టీ అధినేత చంద్రబాబునాయుడు కేటాయించనున్నారు. గురువారం కుప్పంలోని పార్టీ కార్యాలయం ప్రారంభించిన అనంతరం అక్కడే నాలుగు మండలాల పార్టీ నేతలు, కార్యకర్తలతో చంద్రబాబు సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా పార్టీ సభ్యత్వ నమోదు, ప్రజల పక్షాన పోరాటాలు చేయడం, ప్రభుత్వ వైఫల్యాలు ప్రజలకు వివరించడం వంటి వాటిపై దేశం శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నారు. కుప్పంలో పార్టీ కార్యాలయంను పూర్తి స్థాయిలో నేతలు, కార్యకర్తలకు అందుబాటులో తెచ్చారు.

**నేతలను గాడిన పెడతారా :** కుప్పం తెలుగుదేశం పార్టీలో ఉన్న కొంతమంది నేతలు పార్టీ పరంగా సరిగ్గా పనిచేయడం లేదని ఇదివరకే అధినేత చంద్రబాబునాయుడు స్పష్టం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తన పర్యటనలో భాగంగా నేతలను గాడిన పెడతారని కార్యకర్తలు ఆశగా ఎదురుచూస్తున్నారు. పార్టీ కార్యక్రమాలను సైతం నామమాత్రంగా నేతలు చేపడుతున్నారనే విషయం చంద్రబాబు దృష్టికి వెళ్లడంతో అలాంటి నేతల పట్ల ఇకపై ఆయన ఏమాత్రం ఉపేక్షించే అవకాశం లేదని తెలుస్తోంది.

**రెట్టించిన ఉత్సాహంతో ముందుకు :** గత మే నెలలో కుప్పం పర్యటన అనంతరం ఒంగోలులో జరిగిన మహానాడు కార్యక్రమం అనంతరం తెదేపా అధినేత చంద్రబాబునాయుడు రెట్టించిన ఉత్సాహంతో ముందుకుసాగుతున్నారు. అంతేవేగంగాపార్టీ శ్రేణులను సైతం సమాయత్తం చేస్తున్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా సిద్ధమే అన్న రీతిలో తెలుగుతమ్ముళ్లను కార్యోన్ముఖులను చేస్తున్నారు. అందులో భాగంగానే కుప్పంపై సైతం దృష్టి సారించి పార్టీ కేడర్‌ను ప్రజలకు అందుబాటులో ఉండేలా హితోపదేశం చేయనున్నారు. కుప్పం కోటలో పూర్వవైభవం దిశగా అడుగులు వేస్తున్నారు.

### ఉష్ణోగ్రతలు
23/8/2022



- తిరుపతి 34 డిగ్రీలు
- చిత్తూరు 36 డిగ్రీలు
- మదనపల్లి 31 డిగ్రీలు
- శ్రీకాళహస్తి 36 డిగ్రీలు
- వెంకటగిరి 36 డిగ్రీలు
- గూడూరు 36 డిగ్రీలు

### బంగారం ధరలు
23/8/2022



22 క్యారెట్స్ 1గ్రాము రూ. 4,800
24క్యారెట్స్ 1గ్రాము రూ.5,240

### కోడిగ్రుడ్ల ధరలు
23/8/2022



కోడిగ్రుడ్డు :రూ.5.00
1 డజను: రూ.60.00

# ప్రజాసమస్యల పరిష్కారానికే గడప గడపకు మీ ప్రభుత్వం. -ఎమ్మెల్యే వెంకటేగౌడ

పెద్దపంజాణి ఆగస్టు 23 ప్రభాతవార్త :
ప్రజాసమస్యలను క్షేత్ర స్థాయిలో పరిష్కరించటం కోసమే గడప గడపకు మీ ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు పలమనేరు ఎమ్మెల్యే డా.ఎన్.వెంకటేగౌడ తెలిపారు. మంగళవారం రాయలపేట పంచాయతీ పరిధిలోని దిన్నిపల్లి,చెన్నారెడ్డిపల్లి,శెట్టివారి పల్లి,బాలేపల్లి,గుడిపల్లి(బాటకుంట),దాసనంపల్లి గ్రామాల్లో మీ గడప వద్దకే మీ ఎమెల్మ్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.ఎన్.వెంకటేగౌడ పాల్గొన్నారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఏ గడప వద్దకు వెళ్ళినా,అక్కచెల్లెమ్మలను,అవ్వాతాతలను పలకరించినా తమకు తమ బిడ్డ,తమ అన్న ముఖ్యమంత్రి జగనన్న ప్రవేశపెడుతున్న



సంక్షేమ,అభివృద్ధి పథకాలు వల్ల ఎంతో లబ్ది పొందామని మళ్ళీ మళ్ళీ జగనన్నే మాకు ముఖ్యమంత్రి కావాలని కాఆకాంక్షిస్తున్నారని తెలిపారు.దిన్నిపల్లెలో పేదలకు ఇళ్ళ నిర్మాణానికి స్థలం లేదని ఎమ్మెల్యేదృష్టికి తీసుకు రావడంతో ఈ గ్రామంలోనే ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి జగనన్న కాలనీ ఏర్పాటుచేసి త్వరలోనే అర్హులకు స్థలాలు కేటాయిస్తామనిపేర్కొన్నారు.దాసనంపల్లిగ్రామంలో3లక్షల రూపాయలతో నూతన సి.సి రోడ్డు పనులను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి రెడ్డెప్ప,జెడ్పీటీసి సుష్మాకీర్తి,మండల కన్వీనర్ బాగా రెడ్డి,పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ హేమంత్ కుమార్ రెడ్డి,సింగిల్‌విండో ఛైర్మన్ శంకరప్ప,వైకాపా జిల్లా ప్రచార కార్యదర్శి తమ్మిరెడ్డి,వైకాపా నాయకులు సుహేబ్, ప్రసాద్ రెడ్డి,రాజారెడ్డి, రహంతుల్లా,డాక్టర్ చంద్రశేఖర్,సర్పంచుల సంఘం అధ్యక్షులు హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## 24 నుండి కాణిపాకం ఆలయంలో ఆర్జిత సేవలు ప్రారంభం

కాణిపాకం, ఆగస్టు 23 ప్రభాతవార్త:
కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామి ఆలయంలో ఈనెల 24 నుండి స్వామివారి మూలవిరాట్‌కు జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలు ప్రారంభమవుతాయని ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్ బాబులు తెలిపారు. కాణిపాకం దేవస్థానంలో ప్రధాన ఆలయ పునర్నిర్మాణం సందర్బంగా ఆలయంలో స్వామివారికి జరిగే పలు రకాల ఆర్జిత సేవలను రద్దు చేశారు. పలు ఆర్జిత సేవలను ప్రత్యక్షంగా పరోక్షంగా ఉత్సవమూర్తులకు నిర్వహిస్తూ వచ్చారు. ఈనేపథ్యంలో ఈనెల 21న ప్రధాన ఆలయ మహా కుంభాభిషేకం పూర్తి కావడంతో ఈనెల 24 నుండి ఆలయంలో స్వామివారి మూలవిరాట్‌కు జరిగే అన్ని రకాల ఆర్జిత సేవలు యథావిధిగా పునరుద్దరించినట్లు తెలిపారు. ఇదిలా వుండగా ఆలయంలో స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానుండడంతో ఈనెల 31 నుండి సెప్టెంబర్ 20 వరకు ఆర్జిత సేవలను పూర్తిగా రద్దు చేస్తున్నట్లు తెలిపారు. బ్రహ్మోత్సవాల అనంతరం ఆర్జిత సేవలు యథావిధిగా జరుగుతాయని ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ సురేష్‌బాబులు తెలిపారు. ఈవిషయాన్ని భక్తులు గమనించి సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు.

## ఘనంగా ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి

పెద్దపంజాణి, ఆగస్టు 23 ప్రభాతవార్త :



స్వాతంత్ర సమరయోధుడిగా ఎనలేని కీర్తి ప్రతిష్టలు గడించి తెల్లవారి గుండెల్లో భయాన్ని నింపిన ఆంధ్రుల కెరటం ఆంధ్రకేశరి టంగుటూ రి ప్రకాశం పంతులు గారు జయంతి కార్యక్ర మాన్ని మండలంలోని నాగిరెడ్డిపల్లెలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ప్రధానోపా ధ్యాయులు బాబురెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్బంగా ప్రధానో పాధ్యాయులు బాబురెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకాంధ్ర రాష్ట్ర సాధనలో నిర్ణయాత్మక పాత్ర పోషించి ఆంధ్ర కేసరిగాపేరుగాంచినటంగుటూరి ప్రకాశం పంతులు కారణజన్ములు అని కొనియా డారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మీనాక్షి,సుజాత,వాణిశ్రీ,అంజప్ప, రాజేష్‌బాబు, చేతన, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'దేశం' సీనియర్ నాయకురాలు సౌందర్య మృతి

పాలసముద్రం, ఆగస్టు 23 ప్రభాతవార్త:



పాలసముద్రం మండల తెలుగుదేశం సీనియర్ నాయకురాలు సౌందర్య వెంగళరాజుకుప్పం గ్రామంలోనిఆమె స్వగృహంలో మంగళ వారం మృతి చెందారు. ఆమె పార్థీవదేహంకు జిడినెల్లూరు నియోజ కవర్గ తెలుగుదేశం కో-ఆర్డినేటర్ భీమినేని చిట్టి బాబు, ఇతర దేశం నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్బంగా నియోజకవర్గ కో-ఆర్డినేటర్ చిట్టిబాబు ఆమె కుమారుడు మండల తెలుగు యువత ప్రధాన కార్యదర్శి అవినాష్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శేఖర్‌రాజు,మండలఎస్సీ సెల్అధ్యక్షుడు సాంబశివన్, మండల యువత అధ్యక్షుడు సోమశేఖర్, నాయకులు జ్ఞానశేఖర్, మోహన్, మేఘనాథన్, కమ్మపాళెం రవినాయుడు, రామచంద్రయ్య, మండల టిఎన్ఎస్ఎఫ్ నాయకుడు శరవణకుమార్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ విద్యార్థులకు బలమైన పౌష్టికాహారం



– జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి
బంగారుపాళ్యం, ఆగస్టు 23 ప్రభాతవార్త:
అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు బలమైన పౌష్టికాహారంఅందించాలనిజడ్పీసిఇఓప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి మంగళవారం బంగారుపాళ్యం మండలం సంక్రాంతిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రం, గ్రామ సచివాలయంను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్బంగా అంగన్‌వాడీ కేంద్ర సిబ్బందితో జడ్పీ సిఇఓ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రంలో సుచి, శుభ్రత పాటించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్నారు. పిల్లల హాజరు పట్టీ, పౌష్టికాహారం సరఫరా రిజిస్టర్, సిబ్బంది హాజరును జడ్పీ సిఇఓ పరిశీలించారు. అలాగే గ్రామ సచివాలయంను తనిఖీ చేసిన జడ్పీ సిఇఓ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్బంగా జడ్పీ సిఇఓ సచివాలయంలో ప్రభుత్వ పథకాల అమలు డిస్‌ప్లే బోర్డులు, సిబ్బందిహాజరురిజిస్టర్లనుపరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యవసాయ విషయాలు అన్ని రైతులకు తెలపాలి

సదుం, ఆగస్టు23ప్రభాతవార్త



వ్యవసాయానికి సంబందించిన అన్ని విషయాలు రైతులకు తెలపాలని జిల్లా వ్యవసాయాదికారి జె.మురళీకృష్ణ అన్నారు. మంగళవారం ఆయన సదుం మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత గొడ్లవారిపల్లె వద్ద పంట నమోదును తనిఖీ చేశారు. అనంతరం నడిగడ్డ, అమ్మగారిపల్లె పంచాయతీలలోని రైతు భరోసాకేంద్రాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. రైతులకు అందవలసిన రాయితీలు, పనిముట్ల వివరాలు పరిశీలించారు. అమ్మగారిపల్లె వద్ద పొలంబడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్బంగా రైతులతో ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు విదిగా రైతు భరోసా కేంద్రాలను సందర్శించాలన్నారు. ప్రభుత్వం నియమించిన వ్యవసాయసిబ్బందిని కలిసి వ్యవసాయానికి ప్రభుత్వం ఇస్తున్న చేయూత వివరాలను తెలుసుకోవాలన్నారు. ఎవరికైనా ఏదైనా పథకం రాకుంటే వెంటనే సంబందిత సిబ్బందితో మాట్లాడి సరిచేసుకుని ఆది వచ్చేలా చూసుకోవాలన్నారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి మాధవి, సిబ్బంది పాల్గొన్నారు.

## చంద్రబాబు పర్యటన విజయవంతం చేయండి

– రాష్ట్ర కార్యదర్శి ఖాదర్ బాషా



కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త
తెదేపా అధ్యక్షులు, మాజీ సిఎం చంద్రబాబునాయుడు కుప్పం పర్యటనను విజయవంతం చేయాలని రాష్ట్ర టిడిపి కార్యదర్శి, కుప్పం పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా కోరారు. రాష్ట్ర భవిష్యత్తు చంద్రబాబుతోనే సాధ్యమన్నారు. వైకాపా తాటాకు చప్పళ్లకు ఎవరూ భయపడేది లేదని కుప్పం ప్రజలు వచ్చే ఎన్నికల్లో తగు గుణపాఠం చెబుతారన్నారు. ఎన్నికలు ఎప్పుడొచ్చినా తెదేపాకు 160కు పైగా సీట్లు వస్తాయన్నారు. ప్రజల్లో ఇప్పటికే తిరుగుబాటు మొదలైందని అది ఉద్యమంగా మారుతుందన్నారు.

## పవన్ కళ్యాణ్ దృష్టికి రాతి కార్మికుల సమస్యలు

గుడుపల్లె, ఆగస్టు 23 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గంలో రాతి కార్మికుల సమస్యలను జనసేన అధినేత పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెల్లినట్లు గుడుపల్లె మండల ఇన్‌చార్జ్అమీర్‌తెలిపారు.అలాగేహంద్రీ-నీవాపనులు పూర్తికాకపోవడం తోరైతులసమస్యలుఆయనకు వివరించామన్నారు. వీటిపై ప్రశ్నిస్తామని జనసేనాని పేర్కొన్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో గణేష్, జాను, రాజేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## రేపు ఆలయ మండల పూజలు

సదుం,ఆగస్టు23ప్రభాతవార్త
స్థానిక శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీసుబ్రమణ్యస్వామి వారి ఆలయంలో ఈనెల 25 తేదీన మండల పూజలు నిర్వహిస్తున్నట్లుఆలయధర్మకర్త మండల అధ్యక్షుడు నాలి కృష్ణారెడ్డి తెలిపారు. ఆలయంలో ప్రహరీలోపల ఒక వైపు 40 రోజుల క్రితం ఉపాలయంగా శ్రీమరకతలింగేశ్వరస్వామి వారి విగ్రహ ప్రతిష్ట జరిగిందని 40 రోజుల కానుండటంతో ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. సాయంత్రం 3 గంటల నుంచి ఈ కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

## 25న ఉచిత కంటి వైద్య శిబిరం

రొంపిచెర్ల,ఆగస్టు23ప్రభాతవార్త
స్థానిక జివైఎస్ ఫంక్షన్ హాలులోఈనెల 25న తిరుపతికి చెందిన సురేంద్ర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితకంటివైద్యశిబిరంజరుగుతుందనిదంతవైద్యులుమహమ్మద్‌రఫితెలిపారు.ఉదయం9గంటల నుంచి మద్యాహ్ననంవరకుశిబిరంజరుగుతుందనిఅర్హులైనవారికిఆరోగ్యశ్రీపథకంకిందఆపరేషన్లుచేస్తామని చెప్పారు.

## తెలుగుయువత నేతలచే అన్నదానం

కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త
కుప్పం నియోజకవర్గ తెలుగుయువత అధ్వర్యంలో మంగళవారం కుప్పంలో అన్నదానం చేపట్టారు. అన్న క్యాంటీన్ ద్వారా ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఈకార్య క్రమం చేపట్టి ఐదువందల మందికి అన్నదానం చేశారు. నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు మణి మాట్లాడుతూ పేదలకు పట్టెడన్నం పెట్టాలన్న ఆలోచనతో అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాలతో తాము ఈకార్యక్రమం చేపట్టామన్నారు. అన్నదానం చేయదలచినవారు తెదేపా కార్యాలయంలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, మాజీ ఎంపిపి డా॥ వెంకటేష్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, రాష్ట్ర నేత శాంతారాం , మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగం, తెలుగుయువత మండల అధ్యక్షులు సుబ్బు, సుబ్రమణ్యం, సురేష్, చలం, గిరి, నారాయణస్వామి, నరేష్ పాల్గొన్నారు.

## నాడు-నేడు పనులు వేగవంతం చేయాలి : డివైఇఓ

కుప్పంరూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త



పాఠశాలల్లో చేపట్టిన నాడు-నేడు పనులను వేగవంతం చేయాలని డివైఇఓ విజయేంద్రరావు ఆదేశించారు. గురువారం కుప్పం, గుడుపల్లె మండలాల హెచ్ఎంలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీలు, ఇటుకలు, ఇసుకలను ఇంజనీరింగ్ నగదు నుంచి ఎస్టిమేషన్ల ఆధారంగా కొనుగోలు చేయాలన్నారు. నాడు -నేడు మెటీరియల్‌ను తొందరగా వాడాలని, బిల్లులు అప్‌లోడ్ చేయాలని సూచించారు. పనుల పరంగా వెనుకబడ్డ హెచ్ఎంలకు తగు సూచనలు ఇచ్చారు. జెవికె కిట్లు సరఫరా చేసినవారిబయోమెట్రిక్‌వేయించాలన్నారు.పదవతరగతిలోఉత్తీర్ణతవందశాతంవచ్చేలా ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలన్నారు. సమావేశంలో ఎంఇఓలు మహబూబ్ బాషా, శ్రీదేవి, హెచ్ఎంలు పాల్గొన్నారు.

## వడ్డెరల సమస్యలపై అభివృద్ధి మండలి సభ్యులకు వినతి



కుప్పంరూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త
చిత్తూరు జిల్లాలో వడ్డెరలు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర సామాజిక న్యాయ సాధికారత సంస్థ దక్షిణ భారత సంచార జాతుల అభివృద్ధి మండలి సభ్యులు తురకా నరసింహం దృష్టికి తీసుకెల్లినట్లు జిల్లా వడ్డెర యువచైతన్యం అధ్యక్షుడు చల్లా సుబ్రమణ్యం తెలిపారు. కార్యక్రమంలోరాష్ట్రఅధ్యక్షుడు తురకా రామారావు, వేపనీడు మోహన్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం జగనన్న చొరవతో ప్రతి కుటుంబంకు లబ్ది - ఎమ్మెల్సీ భరత్

శాంతిపురం, ఆగస్టు 23 ప్రభాతవార్త



సిఎం జగనన్న చొరవతో రాష్ట్రంలో ప్రతి కుటుంబంకు ఏదో ఓ పథకంలో లబ్ది కలుగుతోందని చిత్తూరు ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన అనికెర పంచాయతీ బెల్లకోగిలలో గడపగడపకు మీ ప్రభుత్వం కార్యక్రమంచేపట్టారు.పాదయాత్రసందర్బంగాప్రజల కష్టాలు తెలుసుకున్న సిఎం జగనన్న నవరత్నాలు పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అనంతరం ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జడ్పీటిసి శ్రీనివాసులు, ఎంపిపి వసుంధర కోదండరెడ్డి, మండల కన్వీనర్ దండపాణి తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

సూళ్లూరుపేట,కోట,వెంకటగిరి ,బాలాయపల్లి దొరవారిసత్రం,

## ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య

కోట,ఆగస్టు 23 ప్రభాతవార్త
కోట మండలం కొత్తపట్నంకు చెందిన ఓ యువకుడు సోమవారం రాత్రి తన నివాసంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ కలహాలే కారణమని గ్రామస్తులు అంటున్నారు. కాగా ప్రేమ విఫలం కావడంతోనే మృతి చెందాడని మరికొందరు పేర్కొంటున్నారు. మంగళవారం తూర్పురా యల సీమ పట్టభద్రల వైకాపా అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో సిద్దవరం సొసైటి ఛైర్మెన్. పాదార్తి రాధకృష్ణారెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు,ఉప సర్పంచ్, ఉప్పల ప్రసాద్ గౌడ్, సర్పంచ్ తిరుపాలయ్య, తదితరులు ఉన్నారు.

## మొక్కలు నాటి ..పర్యావరణాన్ని కాపాడుకొందాం

కోట,ఆగస్టు 23 ప్రభాతవార్త



ప్రతి ఒక్కరు మొక్కలునాటి పర్యావరణాన్ని కాపాడాలని జిల్లా సమరసత సేవా పౌండేషన్ ధర్మ ప్రచారఖ్ శ్రీనివాసులు రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని గూడలి కొండమిట్టఅంగన్‌వాడీస్కూల్‌లోమొక్కల నాటే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు.ఆయనమాట్లాడుతూచెట్లు వలన స్వచ్ఛమైన ఆక్సిజన్ లభిస్తుందన్నారు. అందరు మొక్కలను నాటాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వాకాటి కిషోర్, శ్రీనివాసులు రెడ్డి, నేహ్రూ యువ కేంద్రం వాల్లంటర్ , సలవాడి సోనియో, అంగన్‌వాడీ టిచర్, కోటేశ్వరమ్మ , యూత్ లీడర్ కోటీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## పేటలో ఘనంగా టంగుటూరి ప్రకాశం జయంతి వేడుకలు ...

నాయుడుపేట రూరల్ ఆగష్టు 23 ప్రభాతవార్త;



నాయుడుపేటలోటంగుటూరిప్రకాశంపంతులు జయంతి వేడుకలను ఉపాధ్యాయులు,అధికారులు మంగళ వారం ఘనంగానిర్వహించారు.అనంతరం నాయుడుపేట టంగుటూరిప్రకాశంపంతులుపాఠశాలలోవిశ్రాంత ఉపాధ్యాయుడు మల్లిశెట్టి శివప్రసాద్ ఆధ్వర్యంలో టంగుటూరి ప్రకా శం పంతులు విగ్రహానికి పలువురు ఉపాధ్యాయులు పూలమాలలువేసి నివాళర్పించారు. అనంతరం విద్యార్థులకు చాక్లేట్లును పంచిపెట్టారు.ఈకార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు మల్లిశెట్టి శివప్రసాద్ , ప్రధానోపాధ్యాయుడు రామచంద్ర,ఉపాధ్యాయులు శేఖర్,జయరామయ్య,భాస్కర్,రాజశేఖర్‌రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

## పోషక ఆహార తోటలు ఆహార భద్రతకు సోపానాలు

– కేవికే అధిపతి బిజి రాజులు



వెంకటగిరిరూరల్ ఆగష్టు 23 ప్రభాతవార్త:
మహిళలకు పోషక ఆహార తోటలు ఆహార భద్రతకు సోపానాలు అని కృషి విజ్ఞాన కేంద్రం ఆదిపతి డాక్టర్ బిజి రాజులు అన్నారు.మంగళవారం కృషి విజ్ఞాన కేంద్రంలో అంగన్‌వాడి,మరియు నాడు నేడు స్కూల్ సిబ్బందికి, ఎస్ఇ ఆర్‌పి సిబ్బందికి రైతులకు పోషక ఆహార తోటలు ఆహార భద్రతకు అవగాహ కార్యక్రమం ఏర్పాటు చేశారు.ఈ సందర్బంగా డాక్టర్ బిజి రాజులు మాట్లాడుతూ సేంద్రీయ వ్యవసాయ పద్దతులు ద్వారా కురగాయలు,ఆకు కూరలు పండించాలని, అదేవిధంగా రసాయన ఎరువులు వాడకం తగ్గించాలని రైతులు అదాయం పెంచుకోవాలని సూచించారు.గృహవిజ్ఞాన శాస్రత్తవేత్త డాక్టర్ బి విజయ శ్రీ మాట్లాడుతూ నేడు నేడు స్కూల్స్ ద్వారా ఆందించే మధ్యాహ్నం భోజన పథకంకు, అంగన్ వాడి స్కూల్ ద్వారా అను బంధ పోషక ఆహార కార్యక్రమం కు ప్రోత్సహంగా ఉండేందుకు అయ సంస్థ వారు పోషక ఆహార తోటలు పండించడం ద్వారా పిల్లలకుతల్లులకుగర్భిణిలకుపోషకఆహారంఅందించవచ్చునితెలిపారు.ఈకార్యక్రమంలోకేవికే శాస్త్రవేత్తలు డాక్టర్‌డితిరుపాల్,డాక్టర్‌నాగర్జున్‌రెడ్డి ఐసిడిఎస్ సూపర్ వైజర్ కె ఉమమహేశ్వరీ,తదితరులు పాల్గోన్నారు.

## రైతులను అన్ని విధాలా ఆదుకుంటాం : ఎఎంసి చైర్మన్

చిల్లకూరు, ఆగష్టు 23 ప్రభాతవార్త
రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని ఎఎంసి చైర్మన్ ఓడూరు యమునమ్మ అన్నారు.మంగళవారం ఇటీవల ఎన్నికైన గూడూరు ఎఎంసి ఛైర్మెన్,వైస్ ఛైర్మన్,డైరక్టర్లు, అధికారులతో తొలి సర్వసభ్య సమావేశం ఛైర్మన్ ఛాంబర్‌లో నిర్వహించారు. రైతులకు గ్రామాలలో పొలాలకు వెళ్లే లింకు రహదారుల మరమ్మతులకు ఏర్పాట్లు, అదేవిధంగా ముత్యాలపాడులో ఉన్న గొ ర్రెల సంతకు సంబంధించి స్టోరేజి భవనాని న్ ఛైర్మెన్ మీటింగ్ కోసం ప్రత్యేక హాలు రైతులకు కనీస వసతులు కావాలని తీర్మానించడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో వైస్ ఛైర్మన్ కొట్టు గోవర్ధన్,డైరక్టర్లు దువ్వూరు దిలీప్‌రెడ్డి,దేగపూడి కృష్ణారెడ్డి,ఎస్‌కె సందానిభాషా,సంఘపల్లి సుందర్‌రాజన్,ఇండ్ల చెంచమ్మ,తోపాటు రైతు భరోసా అడ్వైజ్ కమీటి ఛైర్మెన్ ఓడూరు బాలకృష్ణారెడ్డి,అడ్వైజర్ కమీటి సభ్యులు,కమ్మవారిపాలెం గ్రామ సర్పంచ్ చిట్వేటి నారాయణ, ఎఎంసి కార్యదర్శి కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

## ఘనంగా ప్రకాశం పంతులు జయంతి వేడుకలు

చిట్టమూరు, ఆగష్టు 23 ప్రభాతవార్త
మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవో మనోహర్ గౌడ్, పరిపాలన అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జనార్ధన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ శ్రీలత, కంప్యూటర్ ఆపరేటర్ నరేష్, పంచాయతీ రాజ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జగదీష్, సచివాలయ ఇంజనీరింగ్ అసిస్టెంట్లు ఉన్నారు.

## పేర్నాటిని సత్కరించిన నాయకులు

చిట్టమూరు, ఆగష్టు 23 ప్రభాతవార్త



తూర్పురాయలసీమ పట్టభద్రుల ఎంఎల్సీ అభ్యర్థిగా చిట్టమూరుకు విచ్చేసిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డిని వైసీపీ నాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున సన్మానించి, సత్కరిం చారు. ముఖ్యంగామంగళవారం పేర్నాటి రాక సందర్బంగా మండల వైసీపీ కన్వీనర్ సూచనల మేరకు అన్నీ తామై ఏర్పాట్లు చేసినమండలకోఆప్షన్‌సభ్యులుషేక్‌మస్తాన్‌భాయ్, బురదగాలి కొత్తపాలెంగిరిరెడ్డిలు తమ అభిమాన నాయకుడిని శాలువాలు, పూలమాలలతో సన్మానించి సత్కరించారు.

## అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు

– ఎస్ఐ జె.తిరుమలరావు



దొరవారిసత్రం, ఆగష్టు 23 ప్రభాతవార్త
గ్రామాల్లో ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే అలాంటి వారిపై కఠిన చర్యలుతీసుకుంటామనిఎస్ఐజె.తిరుమలరావుఅన్నారు.దొరవారిసత్రం పోలీసుస్టేషన్ లోఆయనవిలేఖరులతోమాట్లాడుతూ ఎవరైనాఅసాంఘికకార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.

## పోలేరమ్మ బంగారు కిరీటానికి చైన్నె వాసి విరాళం

వెంకటగిరి ఆగష్టు 23 ప్రభాతవార్త



వెంకటగిరి గ్రామశక్తి పోలేరమ్మకు బంగారు కిరీటం,ఆభరణాలతయారీకిచెన్నైకిచెందినరంగినేకి వెంకటరమణ, సతీమణి విజయలక్ష్మీ50వేల 116 రూపాయలను విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయం ఛైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఈఓ శ్రీనివాసుల రెడ్డికి అందజేశారు.

## ఎంఎల్‌సీ శ్యాంప్రసాద్‌రెడ్డికి ఘనస్వాగతం

చిట్టమూరు, ఆగష్టు 23 ప్రభాతవార్త



తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్సీ అభ్యర్థిగా వైసీపీ తరపున బరిలోకి దిగిన పేర్నాటి శ్యాంప్ర సాద్‌రెడ్డికి మండలవైసీపీకన్వీనర్‌సన్నారెడ్డిశ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఘనస్వాగతం లభించింది. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపీపీ ఛాంబర్‌కు చేరుకున్న పేర్నాటికి మండలంలోని అన్ని పంచాయతీల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొని తమ మద్దతును తెలియజేశారు. చిట్టమూరుకు విచ్చేసిన ఆయనకు శాలువాలు, పూలమాలలతో సన్మానించి, సత్కరించారు.

**సమష్టిగా పనిచేద్దాం – సన్నారెడ్డి** వైసీపీ తరపున ఎంఎల్సీగా బరిలో ఉన్న తూర్పురాయలసీమ పట్టభద్రుల అభ్యర్థి శ్యాంప్రసాద్‌రెడ్డిని నాయకులందరూ సమష్టిగా పనిచేసి గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని వైసీపీ మండల కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ సన్నారెడ్డితో పాటు మండల ఉపాధ్యక్షులు బీవీ రమణయ్య, జడ్పీటీసీ వెంకటయ్య, గొట్టికాటి రవీంద్రారెడ్డి, కామిరెడ్డి కస్తూరిరెడ్డి, వాకాటి అశ్విన్‌రెడ్డి, చిల్లకూరు కోదండరామిరెడ్డి, కోఆప్షన్‌సభ్యులు మస్తాన్‌భాయ్, గిరిరెడ్డి, మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి, లోకేష్‌రెడ్డి, దేవారెడ్డి సుధాకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, చిట్టమూరు పేర్నాటి యువ నేతలు అన్వేష్, వంశీ, పిట్టవానిపల్లి మణి, ప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## తల్లిపాలతో బిడ్డకు ఎంతో బలం

గూడూరు,ఆగష్టు 23 ప్రభాతవార్త



తల్లిపాలతో బిడ్డకు ఎంతో బలం చేకూరుతుందని ఆంధ్ర మహిళా మండలి గౌరవాధ్యక్షురాలు డాక్టర్ రోహిణి అన్నారు.గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో తల్లిపాల వారోత్సవాలలో భాగంగా ఇన్నర్‌వీల్‌క్లబ్ ఆంధ్ర మహిళా మండలి ఆధ్వర్యంలో మంగళవారం బాలింతలకు,గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు. ఈకార్యక్రమంలో బద్రి సుప్రభా,మల్లా బత్తిన జీవనిరెడ్డి,ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ రామకృష్ణరెడ్డి,విష్ణువందన, శశికళ,డాక్టర్ లక్ష్మీ,రేణుక,ఆసుపత్రి సిబ్బంది పాల్గోన్నారు.

## ప్రజల హృదయాల్లో ప్రకాశం పంతులు – తహశీల్దార్ పద్మావతి

కోట, ఆగష్టు 23 ప్రభాతవార్త



దేశ ప్రజల హృదయాల్లో దివంగత టంగుటూరు ప్రకాశం పంతులు నిలిచిపోయారని తహశీల్దార్ పద్మావతి అన్నారు. మంగళవారం టంగుటూరు ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి తహశీల్దార్ పద్మావతి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జునరావు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొని నివాళి అర్పించారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయంలో ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఎంపీడీవో భవాని నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అంజమ్మ, జడ్పీటీసీ సభ్యులు దాసరి కోటయ్య, చేవూరు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర్యంకోసం ప్రాణాలర్పించిన మహనీయులు ప్రకాశం పంతులు

–చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ



వెంకటగిరి, ఆగష్టు 23 పభాతవార్త
దేశం కోసం ప్రాణలర్పించిన మహనీయులు టంగుటూరి ప్రకాశం పంతులని ఛైర్‌పర్సన్ నక్కా భానుప్రియ తెలిపా రు. టంగుటూరిప్రకాశం పంతులు జయంతి సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో ఆయన చి త్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్వాతంత్ర్యం కోసం టంగుటూరి ఎన్నో పోరాటాలు చేసిన మహనీయులని తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మసాలే కార్పోరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు,వైస్ ఛైర్మన్లు బాలయ్య,ఉమామహేశ్వరి, కౌన్సిలర్స్ పిలక్కీ,నారి శేఖర్,మాడ జానకిరామయ్య,కమీషనర్ గంగాప్రసాద్ పాల్గోన్నారు.9వ బెటాలియన్‌ల్లో కమాండెంట్ పి ప్రకాష్ టంగుటూరి చి త్రపటానికి పూలమాలలు వేసి నివాలర్పించారు. కృషివిజ్ఞాన కేంద్రంలో సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ బిజి రాజులు టంగుటూరి చిత్రపటానికి పూలమాలలు వేసినివాళులరి ్పంచారు.

## టంగుటూరికి ఆదర్శంగా తీసుకోవాలి

బాలాయపల్లి ఆగష్టు 23 ప్రభాతవార్త
దేశం కోసం ప్రాణలర్పించిన మహనీయులు టంగుటూరి ప్రకాశం పంతులని తహసిల్దార్ సుబ్రమణ్యం తెలిపారు. టంగుటూరిప్రకాశం పంతులుజయంతి సందర్భంగా మండల రెవెన్యూ కార్యాలయంలో ఆయన చి త్రపటానికి పూల మాలవేసినివాళుర్పించారు.కార్యక్రమంలో ఆర్ఐ సు బ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ సుధాకర్‌రెడ్డి



బాలాయపల్లి ఆగష్టు 23 ప్రభాతవార్త
బాలాయపల్లి మండల ఎస్ఐగా సుధాకర్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు.ఇక్కడ ఎస్ఐ గా పనిచేస్తున్న తిరుమలరావును దొరవారి సత్రంకు బదిలి అయ్యారు. సుధాకర్‌రెడ్డి చిల్లకూరు నుండి బదిలీపై వచ్చారు. చోరీల నివారణ, తదితర వాటిని అరికడుతానని ఈ సందర్భంగా తెలిపారు.

## పేదల పక్షాన నిలిచిన గొప్పవ్యక్తి ఆంధ్రకేసరి

గూడూరు,ఆగష్టు 23 ప్రభాతవార్త



పేదల పక్షాన నిలిచి ప్రజల కోసం పరితపించిన గొప్ప మహనీయుడు ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు అని భారతీయ శిక్షణ్ మం దల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేశిరెడ్డి ప్రజేం ధ్రరెడ్డి అన్నారు.గూడూరు మండలం మంగళపూరు ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ప్రకాశం పంతులు 151వ జయంతి వేడుకలు జరిగాయి. భారతీయ శిక్షణ్ మండల్ ఆధ్వర్యంలో ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాలలు వేసి అలంకరించారు. ఆంధ్రకేసరి-సైమన్ కమిషన్ మధ్య జరిగిన సన్నివేశాలను నాటిక రూపంలో ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులుఎం. మునిరాజాచారి,ఎస్.రవీంద్ర,ఎస్‌డిఫజల్,ఏ.రవి,జబీనాసుల్తానా,విద్యార్థులు గ్రామస్తు లు పాల్గోన్నారు.

## ఘనంగా టంగుటూరు ప్రకాశం పంతులు జన్మదిన వేడుకలు

చిల్లకూరు, ఆగష్టు 23 ప్రభాతవార్త
ఆంధ్రకేసరిటంగుటూరుప్రకాశంపంతులు151 వ జన్మదిన వేడుకలు తహసిల్దారు కార్యాలయం, ఎంపిడిఒ కార్యాలయం,పోలీస్‌స్టేషన్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దారు జి.స్వర్ణ, ఎంపిడిఒవిష్ణు చిరంజీవి, ఇఒఆర్‌డి మాణిక్యం, ఎస్ఐ గోపాల్, ఏఓ శ్రీనివాసరావు, ప్రసన్న, ఆర్ఐ చైతన్య,విఆర్‌ఒలు పంచాయితీ కార్యదర్శులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## సరిహద్దు సమస్య పరిష్కారానికి రెండు రాష్ట్రాల అధికారులు



తడ, ఆగస్టు 23 ప్రభాతవార్త

ఆంధ్రా, తమిళనాడు సరిహద్దుల్లో ఇటీవల ఒక స్థల వివాదంపై రెండు రాష్ట్రాల అధికారులు మంగళవారం స్పందించారు. తమిళనాడులోని ఆరంబాకం, ఆంధ్రాలోని భీములవారిపాలెం సమీపంలో రెండు రాష్ట్రాల మధ్య ఒక స్థల వివాదం ఉంది. గతంలోనూ, ఇటీవల కూడా ఈ సరిహద్దు సమస్య వల్ల పలుమార్లు ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. అయితే ఈ సమస్య పరిష్కారం కోసం మంగళవారం ఇరు రాష్ట్రాల అధికారులు సమన్వయంతో వ్యవహరించి అక్కడ సమావేశమయ్యారు. తమిళనాడులోని గుమ్మిడిపూండి రెవెన్యూ అధికారులు, ఆరంబాకం పోలీసులతో పాటు సర్వే బృందం, ఆంధ్రా ప్రాంతంలోని తడ మండల తహశీల్దార్ రామయ్య, ఎస్ఐ జె.పి.శ్రీనివాసరెడ్డి తమ తమ సిబ్బందితో వెళ్లి సర్వే నిర్వహించారు. అనంతరం రెండు రాష్ట్రాల సరిహద్దుల గ్రామాల వారితోనూ మాట్లాడారు. ఈ సమస్యను సామరస్యంగా పరిష్కరించే దిశలో రెండు రాష్ట్రాల అధికారులు ఉన్నారు.

## నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



కాణిపాకం, ఆగస్టు 23 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో అమలవుతున్న శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ఓ భక్తుడు మంగళవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. ఈమేరకు హైదరాబాద్‌కు చెందిన రమేష్ అనే భక్తుడు ఈమొత్తాన్ని విరాళంగా అందజేశారు. దాతలు విరాళ మొతా_న్ని కుటుంబసభ్యులతో కలసి ఆలయ ఛైర్మన్ మోహన్‌రెడ్డికి అందజేశారు. దాతలకు ఆలయ సం ప్రదాయం ప్రకారం స్వామివారి దర్శనం కల్పించి తీర్థ, ప్రసాదాలను అందజేశారు. ఈకార్యక్రమంలో సూపరెండెంట్ కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రమేష్, బాబు, దాత కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## వధూవరులను ఆశీర్వదించిన సిపిఐ నేత నారాయణ



చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:

జిల్లా కేంద్రం చిత్తూరులో జరిగిన ఓ వివాహంకు జాతీయ సిపిఐ కార్యదర్శి డాక్టర్ నారాయణ హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు. చిత్తూరు సంతపేట ఆర్ఆర్ గార్డెన్స్‌లో మంగళవారం జిడినెల్లూరు మండలం గంగిరెడ్డికండ్రిగకు చెందిన పూజ, తవణంపల్లి మండలం అరగొండ చెర్లోపల్లి గ్రామంకు చెందిన తేజేష్‌ల వివాహం జరిగింది. ఈ వివాహంకు జాతీయ సిపిఐ కార్యదర్శి నారాయణతో పాటు హరినాథరెడ్డి, జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు టి.జనార్ధన్, ప్రసాద్ తదితరులు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

## ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలకు విచ్చేయండి

### సుప్రీం సిజె జస్టిస్ రమణకు అఖిల భారత తెలుగు అకాడమీ ఆహ్వానం





తిరుపతి, ఆగస్టు 23ప్రభాతవార్త:

సెప్టెంబర్‌లో కర్నాటక బెంగుళూరులో జరగనున్న ఎన్టీరామారావు శతజయంతి ఉత్సవాలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని అఖిల భారత తెలుగు అకాడమీ ఆహ్వానించింది. ఈ మేరకు భారతప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌వి రమణను కలసిన అకాడమీ ప్రతినిధులు దుశ్శాలువతో సన్మానించి మెమొంటోను బహుకరించారు. సెప్టెంబర్‌లో నిర్వహించనున్న శతజయంతి ఉత్సవాలకు హాజరై అమూల్యమైన సందేశాన్ని ఇవ్వాలని కోరారు. జస్టిస్ రమణను కలసిన వారిలో అకాడమీ అధ్యక్షుడు గారపాటి రామకృష్ణ, గౌరవ అధ్యక్షుడు బివి శేఖర్, ప్రధాన కార్యదర్శి కె.రామజోగేశ్వరరావు, కోశాధికారి టివి ప్రసాద్, శ్రీనివాసరావు, నిమ్మకూరు ప్రసాద్, గాజుల సత్యనారాయణ ఉన్నారు. అలాగే ఈనెల 28న తిరుపతిలోని కమ్మవారి సంఘం కల్యాణమండపంలో ఎన్టీరామారావు శతజయంతి వేడుకలు జరుగుతాయని తెలిపారు.

## భక్తిశ్రద్ధలతో చాటుబండి ఊరేగింపు



పుత్తూరురూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:

పుత్తూరు గంగజాతర సందర్భంగా మంగళవారం రాత్రి డప్పు మేళాలు ప్రత్యేక పుష్పాలతో విద్యుత్ దీపాలంకరణతో చాటు బండి కార్యక్రమాన్ని కార్వేటినగరం రోడ్డులోని మంచినీళ్ళగుంట వద్ద నుంచి ప్రారంభించారు. కాపువీధి, బజారువీధిల మీదుగా గంగమ్మ మండపం వద్దకు చేరుకుంది. ఉదయం ఆలయంలో అమ్మవారికి ప్రత్యే అనంతరం అభిషేకాలు, అలంకరణలు చేశారు. గెరిగెను పురవీధుల్లో ఊరేగించారు. అర్ధరాత్రిపైన గంగమ్మను నడి వీధిలో ప్రతిష్టించి పూజలు చేశారు. దీంతో గంగజాతర ప్రారంభమైంది. ఆలయం వద్ద చలువ పందిళ్లు, వేపాకు తోరణాలు సుందరంగా అలంకరించారు. భక్తులకు ఇలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేకమైన క్యూలైన్లు ఏర్పాటు చేశారు. అలాగే పట్టణంలోని పలు చోట్ల విద్యుత్ దీపాలంకరణతో ప్రత్యేకమైన అమ్మవారి కటౌట్లను ఏర్పాటు చేశారు.

## గంగజాతరకు మంత్రి రోజాకు ఆహ్వానం



పుత్తూరురూరల్, ఆగస్టు 23 ప్రభాతవార్త:

పుత్తూరు పట్టణంలో బజారువీధిలో వెలసిన గ్రామదేవత గంగమ్మజాతర బుధవారం జరగనుంది. ఈ నేపథ్యంలో పర్యాటకశాఖ మంత్రి రోజాను గంగజాతర కమిటీ నగరిలోని మంత్రి స్వగృహంలో కలసి ఆహ్వాన పత్రికను అందించారు. జాతరకు తప్పక హాజరు కావాలని కోరారు. ఆహ్వానించిన వారిలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ జయప్రకాష్, విశ్రాంత విద్యుత్‌శాఖ ఉద్యోగి గజేంద్రుడు శివాలయం మాజీ ఛైర్మన్ కొడగంటి ప్రకాష్, కుమార్, చక్రి తదితరులు ఉన్నారు.

# కార్మిక జాతీయ సదస్సును విజయవంతం చేయండి

### – జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి

తిరుపతి కలెక్టరేట్, ఆగష్టు 23 ప్రభాతవార్త ః

తిరుపతి తాజ్ హోటల్‌లో ఈనెల 25, 26వ తేదీల్లో జరగనున్న కార్మిక జాతీయ సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె. వెంకటరమణారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జాతీయ కార్మిక శాఖ సదస్సుకు హాజరవుతున్న ప్రముఖులకు కేటాయించిన లైజన్ అధికారులతో, వివిధ కమిటిల అధికారులతో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, కేంద్ర ప్రావిడెంట్ ఫండ్ అధికారిణి నీలం సామి రావు, కేంద్ర కార్మిక శాఖ డైరెక్టర్ రాహుల్ భగత్, అడిషనల్ సెంట్రల్ పీఎఫ్ కమీషనర్ పూనే శ్రీ కృష్ణ, రీజనల్ పీఎఫ్ అధికారి పూనే రవీంద్ర కుమార్ సుదీర్ఘంగా సదస్సు నిర్వహణ ఆతిథ్యంపై సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తిరుపతి జిల్లా ఏర్పడ్డాక మొదటి జాతీయ సదస్సు ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని, అతిథులకు అతిధ్యం నుంచి తిరుగు ప్రయాణం అయ్యే వరకు అధికారులు వారికి కేటాయించిన విధుల మేరకు చిన్నపాటి సమస్యలు లేకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జిల్లా కలెక్టరేట్‌లో 24/7 కంట్రోల్ రూమ్ 6281156480, 6281156495 ఏర్పాటు చేశామన్నారు. అలాగే సదస్సు నిర్వహణ కోసం కమిటీలను ఏర్పాటు చేసి పలు మార్లు సమావేశాలు నిర్వహణ జరిగిందని, ఆ మేరకు విధులను కేటాయించడం జరిగిందన్నారు. కేంద్ర కార్మిక ఉపాధిశాఖ మంత్రి భూపేంద్ర యాదవ్ అధ్యక్షతన జరగనున్న జాతీయ సదస్సుకు వివిధ రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల కార్మిక శాఖ మంత్రులు ఏపీ–గుమ్మనూరు జయరాం, అరుణాచల్‌ప్రదేశ్–తుమ్మే బాగ్ర, అస్సాం–సంజయ్ కిషన్, చత్తీష్‌ఘడ్– డాక్టర్ శివకుమార్, దహరియ, బీహార్– సురేంద్రరాం, గుజరాత్–బ్రిజేష్ మెర్జా, హర్యానా–అనూప్‌కుమార్, హిమాచల ప్రదేశ్–బిక్రమ్ సింగ్, మధ్యప్రదేశ్–బ్రిజేంద్ర, ప్రతాపసింగ్, మహారాష్ట్ర–సురేష్‌ఖాదే, మణిపూర్–డింగో సింగ్, ఒడిస్సా–శ్రీకంఠ సాహూ, రాజస్థాన్–సుఖరామ్ విష్ణోయి, సిక్కిం–మింగమ నోర్పు, షేర్ప, తమిళనాడు–సి.వి గణేషన్, తెలంగాణ–మల్లారెడ్డి, త్రిపుర–భగబాన్ సి.హెచ్‌దాస్, ఉత్తరప్రదేశ్–అనిల్ రాజ్భర్, ఉత్తరాఖండ్–సౌరభ్ బహుగుణలతో పాటు కార్మిక శాఖ సెక్రటరీలు, కమీషనర్లు దాదాపు 90 మందికి పైగా ఇప్పటి వరకు హాజరు కానున్నారని వివరాలు అందాయన్నారు. ఈ సమీక్షలో వివిధ శాఖల జిల్లా అధికారులు, విధులు కేటాయించిన లైజన్ అధికారులు పాల్గొన్నారు.

## బంగారు ధ్వజస్థంభం ఏర్పాటు నా పూర్వజన్మ సుకృతం

### -ధ్వజస్థంభం నిర్మాణ దాత మణి



కాణిపాకం, ఆగస్టు 23 ప్రభాతవార్త:

ప్రసిద్ధ పుణ్యక్షేత్రం సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి ఆలయంలో నూతన బంగారు ధ్వజస్థంభం ఏర్పాటు చేసే అవకాశం రావడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని ధ్వజస్థంభం నిర్మాణ దాత హైదరాబాద్‌కు చెందిన దాత మణి తెలిపారు. సుమారు 10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో దాతల సహకారంతో ప్రధాన ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి కావడంతో ఆదివారం ఆలయ మహా కుంభాభిషేకం అత్యంత వైభవంగా జరిగిన విషయం విధితమే. ప్రధాన ఆలయ పునర్నిర్మాణంతో పాటు హైదరాబాద్‌కు చెందిన దాత మణి సహకారంతో సుమారు 4 కోట్లు రూపాయల వ్యయంతో నూతన బంగారు ధ్వజస్థంభంను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ధ్వజస్థంభం నిర్మాణం పూర్తి కావడంతో ఆదివారం ప్రధాన ఆలయంతో పాటు నూతన ధ్వజస్థంభం కుంభాభిషేకం కూడా జరిగింది. ఈసందర్బంగా దాత మణి మాట్లాడుతూ కాణిపాకం నూతన ఆలయంలో నూతన బంగారు ధ్వజస్థంభం ఏర్పాటు చేసే అవకాశం తనకు దక్కడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే నూతన బంగారుధ్వజ స్థంభం రాగిరేకు తొడుగులతో ఏర్పాటు చేసి కుంభాభిషేకం నిర్వహించడం జరిగిందన్నారు. ఈధ్వజస్థంభానికి బంగారు తాపడం పనులు వీలైనంత త్వరగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానని మణి తెలిపారు. ధ్వజస్థంభం నిర్మాణానికి పాలకమండలి ఛైర్మన్ మోహన్‌రెడ్డి, ఈఓ ఎంవి.సురేష్‌బాబులు తనకు ఎంతో సహకారం అందిస్తున్నట్లు దాత మణి తెలిపారు.

## వెంకటగిరి నియోజకవర్గంలో బంద్ విజయవంతం

### ఉమ్మడి జిల్లాల ఎంఎస్‌ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు సురేష్ మాదిగ

వెంకటగిరిరూరల్ ఆగస్టు 23 ప్రభాతవార్త:

ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణమాదిగ ఆదేశాలు మేరకు రాజస్థాన్‌లో 3వ తరగతి చదువుతున్న ఎస్సి విద్యార్థిని కుల దురహంకార హత్యను నిరసిస్తూ మంగళవారం దేశ వ్యాప్తంగా అదేవిధంగా వెంకటగిరి నియోజకవర్గంలో అన్ని ప్రభుత్వ ప్రవేట్ పాఠశాలలు,కళాశాలలు బంద్ చేయడం జరిగిందని ఉమ్మడి జిల్లాల ఎంఎస్‌ఎఫ్ మాజీ జిల్లా అధ్యక్షుడు మంగళపూరి సురేష్ మాదిగ అన్నారు.ఈ సందర్బంగా సురేష్ మాదిగ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు గడుస్తున్నా దళితుల జీవితాలు ఏ మాత్రం బాగుపడలేదని ఆరోపించారు. దేశంలో అంటారానితనం కుల వివక్ష రూపు మాపడానికి కేంద్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన రాజస్థాన్ సంఘటనపై ప్రధాన మంత్రి స్పందించి బాధిత కుంటుంబానికి కోటి రూపాయలు పరిహారం మరియు ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు.అదేవిధంగా ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపకులు మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో దళిత గిరిజన బహుజన లందురు రాజ్యాధికారం సాదించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయుకలు పల్లిపాటి వెంకటేశ్వర్లు(వెంకీ),మణి,వెంకటేష్,కళ్యాణ్ మాదిగ అన్ని విద్యార్ధి సంఘం నాయుకులు పాల్గోన్నారు.

## 28న జిల్లా స్థాయి బాడీబిల్డింగ్, జిమ్నాస్టిక్స్ పోటీలు

తిరుపతి ప్రెస్‌క్లబ్, ఆగస్టు 23 ప్రభాతవార్త:

ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయి బాడీబిల్డింగ్, జిమ్నాస్టిక్ స్ పోటీలు ఈనెల 28న తిరుపతి యూత్ హాస్టల్‌లో ఉమ్మడి చిత్తూరు జిల్లా బాడీబిల్డింగ్, జిమ్నాస్టిక్ స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతుందని తిరుపతి జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.ఈశ్వర్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ఎస్వీ.శివప్రసాద్ తెలిపారు. బాడీ బిల్డింగ్‌కు సంభందించి 9 కేటగిరీల్లో పోటీలు జరుగుతాయని తెలిపారు. 55 కేజీలు, 60, 65, 70, 75, 80, 85, 90, 90 ప్లస్‌లలో పోటీలు జరుగుతాయని తెలిపారు. పోటీల్లో విజేత చాంపియన్‌షిన్‌కు ఐదు వేల రూపాయలు నగదు బహుమతి ఇవ్వబడుతుందని తెలిపారు. అలాగే మొదటి స్థానం పొందిన క్రీడాకారులకు వెయ్యి రూపాయలు,మెడల్ మెరిట్ సర్టిఫికేట్, రెండవ, మూడవ స్థానం పొందిన క్రీడాకారులకు 500 రూపాయలు, మెడల్ సర్టిఫికేట్‌ను ఇవ్వడం జరుగుతుందని, ఈశ్వర్ ప్రకాష్, ఎస్వీ.ప్రసాద్‌లు తెలిపారు. అలాగే జిమ్నాస్టిక్స్‌లో సబ్‌జూనియర్స్ జూనియర్స్, సీనియర్స్ గ్రూపులకు పోటీలు వుంటాయని తెలిపారు. ఆర్టిస్టిక్స్ రిథమిక్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. పోటీలు ఉదయం 11 గంటల నుండి 2 గంటల వరకు జరుగుతుందని వారు తెలిపారు.

## చంద్రబాబు పర్యటన వివరాలిలా!!

కుప్పం, ఆగస్టు 23 ప్రభాతవార్త

ప్రతిపక్ష నేత, తెదేపా అధినేత నారా చంద్రబాబునాయుడు నేటినుంచి కుప్పం నియోజకవర్గంలో పర్యటించనున్నారు. పర్యటన వివరాలు ఇలా.. 24న ఉదయం 10గంటలకు హైదరాబాదులో బయలుదేరుతారు. 10.30గంటలకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. మధ్యాహ్నం 2.30గంటలకు రామకుప్పం మండలం కొంగనపల్లికి చేరుకుంటారు. 3గంటలకు కొల్లుపల్లి, 4గంటలకు చెల్దిగానిపల్లి, 5గంటలకు రామకుప్పంలో పర్యటించి ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అక్కడ బాదుడే బాదుడు కార్యక్రమంలో పాల్గొంటారు. 6.30గంటలకు రామకుప్పం నుంచి కుప్పంకు బయలుదేరి ఆర్అండ్‌బి అతిథిగృహం చేరుకుంటారు. 25న ఉదయం 10.30గంటలకు కుప్పం ఆర్అండ్‌బి అతిథిగృహంలో ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు.10.45గంటలకు కుప్పంలోని అన్న క్యాంటీన్‌ను పరిశీలిస్తారు. 11గంటలకు కుప్పంలోని పార్టీ కార్యాలయంను ప్రారంభిస్తారు. 11.30గంటలనుంచి రాత్రి 9.45గంటలవరకు కార్యకర్తలతో సమావేశమవుతారు. 26న ఉదయం 10.30గంటలకు ప్రజలనుంచి వినతిపత్రాలు స్వీకరిస్తారు. 11.15గంటలకు మోడల్ కాలనీచేరుకుని సందర్శిస్తారు. 12.45గంటలకు కెడిపల్లిలో గ్రామ సందర్శన చేస్తారు.2.45గంటలనుంచి జరుగు, గుడ్లనాయనపల్లి గ్రామాల్లో 4.45గంటల దాకా సందర్శిస్తారు. 5గంటలకు గుడుపల్లె మండలం ఒఎన్ కొత్తూరులో పర్యటిస్తారు.

## అమ్మవారిని దర్శించుకున్న మంత్రి గోపాలకృష్ణ

తిరుచానూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:



తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారిని మంగళవారం రాష్ట్ర బిసి వెల్ఫేర్ మరియు సమాచార పౌరసంబంధాల శాఖా మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఏఈఓ ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూధన్‌లు ఆలయం వద్ద ఘన స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనా నంతరం ఆశీర్వాదమండపం వద్ద వేద ఆశీర్వచనంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందచేశారు.

## శివయ్య సన్నిధిలో రోజా కాలభైరవ అభిషేకం



శ్రీకాళహస్తి, ఆగస్టు 23 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరుని సన్నిధిలో వెలసిన కాలభైరవునికి మంగళవారం మంత్రి ఆర్‌కె రోజా అభిషేకాలు జరిపించుకున్నారు. ప్రతి మంగళవారం ఆలయంలో స్వామి అమ్మవార్లకు నైవేద్యం జరిపిన తరువాత ఆలయం తరఫున అబిషేకాలు జరపటం ఆలయంలోనే ఉత్సవం నిర్వహించటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో టూరిజం శాఖ మంత్రి ఆర్‌కె రోజా మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆలయంలో నిర్వహించే అన్ని పూజలు అభిషేకాలు జరుపుకున్నారు.ఈ నేపథ్యంలో రాత్రి నిర్వహించే కాలభైరవ అభిషేకాలను జరిపించుకొన్నారు. స్వతహాగా శైవ భక్తురాలైన ఆర్‌కె రోజా మహాశివరాత్రి పర్వదినాన స్వామి గర్భగుడి వెనుక ఉన్న లింగోధ్భవ మూర్తి విగ్రహం వద్ద దీపాలు వెలిగించారు. మంగళవారం కాలభైరవునికి అభిషేకాలు జరిపారు. శత్రుభయం తొలగటానికి ఈ అభిషేకాలు నిర్వహించటం ఆవాయితి.ఈ నేపథ్యంలో ఆర్‌కె రోజా పూజలు చర్చనీయాంశంగామారింది.ఆమెకు స్థానిక శాసనసభ్యుడు బియ్యపు మధూధనరెడ్డి కుమార్తె బియ్యపు పవిత్రారెడ్డి సారధ్యంలో ఏర్పాట్లు చేసారు. స్వాగతం చెప్పిన వారిలో లోకేష్‌యాదవ్, బోర్డు సభ్యులు మల్లికార్జన్ రెడ్డి, రమాప్రభ, పసల సుమతి,లక్ష్మీ,కొండూరు సునీత,చింతామణి పాండు,పంతులు,తదితరులు స్వాగతం పలికారు.పూజల అనంతరంఆమెకు కలంకారి కళాఖండాన్ని పవిత్రారెడ్డి అందజేసారు. మంత్రి ఆర్ కె రోజా ఆలయంలోనే సుమారు 12గంటల పాటు గడిపారు.

## ఆలయానికి నాగాభరణం వితరణ



శ్రీకాళహస్తి, ఆగస్టు 23 ప్రభాతవార్త

దక్షిణకైలాసం, వాయులింగేశ్వరుడు కొలువై ఉన్న శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రం అనుబంధంగా ఉన్న భరద్వాజతీర్ధం నందు వెలసి ఉన్న శివాలయంలోని శివయ్యకు తెలంగాణా రాష్ట్రం ఖమ్మం జిల్లా సత్తుపల్లి వాస్తవ్యులైన ఒగ్గురామిరెడ్డి తమ కుటుంబసభునయలతో కలసి 3కేజీల 800 గ్రాముల బరువు కలిగిన రూ.3లక్షలు రూపాయలు విలువ చేసే 'నాగాభరణం'ను వితరణగా ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ అంజూరుతారకశ్రీనివాసులకు అందించారు. ఈసందర్భంగా ఆలయన ఛైర్మన్ దాతలకు స్వామిఅమ్మవార్ల ప్రత్యేకదర్శనం చేయించి తీర్థప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఎసి మల్లిఖార్జున్ ప్రసాద్, పాలకమండలి సభ్యులు మున్నారాయల్, జయశ్యాం, ప్రకాశంపంతులు, ప్రత్యేక ఆహ్వానితులు చింతామణి పాండు, ఆలయ పూజారి శ్రీకాంత్‌శర్మ మరియు ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఫోటో–ఎస్‌కెహెచ్‌టి–3

## ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి

### లక్ష్యం మేరకు పన్నుల వసూళ్ళు

### రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పివివిఎస్ మూర్తి



మున్సిపల్ అధికారులతో సమీక్షిస్తున్న రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పివివిఎస్ మూర్తి

చిత్తూరు, ఆగస్టు 23 ప్రభాతవార్త:

ప్లాస్టిక్ నిషేధంపై ప్రత్యేక దృష్టి సారించాలని అనంతపురం రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పివివిఎస్ మూర్తి అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ సమావేశభవనంలో మంగళవారం కమీషనర్ డాక్టర్ జె.అరుణతో కలిసి రీజినల్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ పివివిఎస్ మూర్తి అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఎం పివివిఎస్ మూర్తి మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలన్నారు. నగర పాలక సంస్థ ఆదాయం పెంచడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నిర్ధేశించిన లక్ష్యం మేరకు పన్నుల వసూళ్ళను పక్కాగా పూర్తి చేయాలన్నారు. అలాగే రోజు వారి దస్త్రాలు ఈ–ఆఫీసు విధానంలో సాగించాలని, ప్రధానంగా ఇంజనీరింగ్ విభాగంకు సంబంధించిన ఫైళ్ళు పూర్తిగా ఈ–ఆఫీసులోనే చేపట్టాలని ఆదేశించారు. అలాగే ఒకసారి వినియోగించి పారవేసిన ప్లాస్టిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్లాస్టిక్ వినియోగంపై తరచు తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వారి నుండి అపరాధ రుసుం వసూలు చేయాలన్నారు. అలాగే మెప్మా తరపున ప్రజలకు ప్రత్యామ్నాయంగా బ్యాగులు అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా మెప్మా ద్వారా అమలు అవుతున్న కార్యక్రమాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. అలాగే అర్బన్ హెల్త్ సెంటర్ల నిర్మాణాలపై అధికారులతో ఆయన సమీక్షించి నిర్ధేశించిన గడువులోపు నిర్మాణాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమీషనర్ గోవర్ధన్, ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్, ఎంఇ ధనలక్ష్మీ, మేనేజర్ ఉమామహేశ్వర్‌రెడ్డి, మెప్మా సిఎంఎం గోపి, అకౌంట్స్ ఆఫీసర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.